# పద్యమూ - పడగ్గదీ..

## ఆర్. రాఘవరెడ్డి

‘‘ఒరే గోపాలం! నీ కోరిక మరీ చోద్యంగా ఉందిరా.. నువ్విలా పిచ్చిపిచ్చి కోరికలు కోరావంటే ఈ జన్మకి పెళ్ళికాక ఒంటికాయ శొంఠి కొమ్ములా ఊరేగాల్సొస్తుంది’’ అంది బామ్మ.

‘‘అంత పిచ్చిపిచ్చి కోరికలు నేనేం కోరానే?’’ ఆశ్చర్యంగా అడిగాడు గోపాలం.




గోపాలానికి ప్రాచీన తెలుగు సాహిత్యమంటే ఇష్టం. అందునా నంది తిమ్మన వ్రాసిన ‘పారిజాతాపహరణం’ కావ్యమంటే మరీ ఇష్టం. ఆ కావ్యంలో తిమ్మన సత్యభామ ఏడుపును వర్ణించిన ‘‘... ఏడ్చె లతాంగి పాల పల్లవ గ్రాస కషాయకంఠ కలకంఠ వధూ కలకాకలీధ్వనిన్...’’ (ఆమె ఏడుపు లేత చివుళ్ళు మెక్కిన కోయిల కూజితంలా ధ్వనించిందట!) అన్న పద్యం ఇంకా ఇష్టం.

ఎంత ఇష్టమంటే తను జీవితంలో పెళ్ళంటూ చేసుకుంటే సత్యభామ అనే పేరున్న అమ్మాయినే చేసుకోవాలనీ, ఆ అమ్మాయి నంది తిమ్మన తన కావ్యంలో వర్ణించినంత అందంగా, ముద్దుముద్దుగా ఏడవ గలిగిన దయ్యుండాలనీ భీష్మించుకున్నాడు.

ఏడవడమనేది బాధను వ్యక్తపరిచే ఒక సాధనమనీ, ఎప్పుడు పడితే అప్పుడు ఏడ్చెయ్యడం సాధ్యంకాదనీ తర్కం తోచనంతగా... ఆ పద్యాన్ని ప్రేమించాడతను!

కానీ ఈ వ్యవహారం బామ్మకి సుతరామూ నచ్చలేదు. ‘‘సత్యభామ అనే పేరున్న అమ్మాయే కావాలంటున్నావ్, సరే... అంతవరకూ పర్లేదు. ఆ అమ్మాయి అదేదో కావ్యంలో లాగే ఏడవాలంటావేమిటి? పెళ్ళిచూపులప్పుడు అమ్మా... కొంచెం నడిచి చూపించు, పాడి చూపించు అన్నట్లుగానే కొంచెం ఏడ్చి చూపించు అని కూడా అడగాల్నా? అలా అడిగితే చెప్పుచ్చుకు వెంటపడరుట్రా ఆడపెళ్ళివాళ్ళు?’’

బామ్మ మాటలతో గోపాలం కొంచెం ఆలోచనలో పడ్డాడు. నిజంగానే ఒంటికాయ శొంఠికొమ్ములా మిగిలిపోతానేమోనని భయపడ్డాడు.

‘‘సరే... నీ ఇష్టమొచ్చినట్లు చెయ్యవే. అయితే అమ్మాయి పేరు మాత్రం సత్యభామే అయి వుండాలి. కావ్య నాయికలా మనోహరంగా ఉండాలి. తెలుగు సాహిత్యం పట్ల అభిరుచి వుండాలి’’ అన్నాడు.

ఇక బామ్మ పెళ్ళి ప్రయత్నాల్లో పడింది. చూడగా చూడగా తమ బంధుత్వంలోనే ఒకమ్మాయి బాగా నచ్చింది. అమ్మాయి పేరు ‘సత్య’. ‘భామ’ అనే

రెండు అక్షరాల్నీ బామ్మే తగిలించేసింది. నిజంగానే కావ్యనాయికలా ఉన్న సత్య గోపాలానికీ నచ్చింది. ఒక్కసారి ఏడ్చి చూపించమంటే బావుంటుందేమో ననిపించినా బామ్మ చేసిన హితోపదేశం గుర్తొచ్చి మౌనంగా ఉన్నాడు.

***

శోభనం. అందానికే అందంలా సత్య పాలగ్లాసుతో గదిలోకొచ్చింది. కిటికీ దగ్గర నిలబడి బయటకు చూస్తున్నాడు గోపాలం. అతను పలకరిస్తాడేమోనని కాసేపు చూసి మెల్లగా వచ్చి మంచం మీద కూర్చుంది.

గోపాలం మనసులో ఒక్కటే కోరిక మెల్లమెల్లగా పెద్దదవుతోంది. 'ఏడిస్తే బావుణ్ణు... పాల పల్లవ గ్రాస కషాయకంఠ కలకంఠ వధూకలకాకలీధ్వనిన్... అన్నట్లు ముద్దుగా, ముద్దుముద్దుగా ఆమె ఏడిస్తే బావుణ్ణు!'

హృదయం మాత్రమే పనిచేసి మెదడు పనిచేయనిచోట తర్కానికి స్థానం ఉండదేమో!!

ఇలా ఏడుపుగొట్టు ఆలోచనల్తో గోపాలం అలాగే నిలబడిపోయేసరికి సత్యకు కంగారు పుట్టింది. 'ఏంటీయన... బెల్లంకొట్టిన రాయిలా నిలబడిపోయాడు. కొంపదీసి ఈ పెళ్ళి తనకిష్టం లేదా ఏమిటి? ఒకవేళ పెళ్ళికి ముందే ఏదైనా ప్రేమాయణం ఉండి ఉంటుందా లేకపోతే శారీరకంగా ఏమైనా లోపం..' సందేహం పూర్తిగా మనసులోకి ప్రవేశించకముందే కళ్ళు సజలాలయ్యాయామెకు. ఏడవసాగింది.

గోపాలంలో కదలిక మొదలయింది. 'ఏడుస్తోందామె!' పారిజాతాపహరణంలోని సత్యభామ ఏడుపుకంటే అందంగా ఉందా ఏడుపు. ఆహా... ఏమి తన అదృష్టం. తన కోరిక నెరవేరింది.

గోపాలం తనకు తెలీకుండానే ముందుకు కదిలాడు. మంచం దగ్గరకొచ్చాడు. లైటార్పేశాడు. ఏడుస్తోన్న ఆమెను దగ్గరకు తీసుకున్నాడు. వరద గోదారిలా పోటెత్తిపోయాడు.

తనను ఆ పద్యం ఇంతగా ప్రభావితం చేసిందా అని గోపాలమే ఆశ్చర్యపోయాడు. ప్రతిరాత్రీ పడగ్గదిలో ఇదే తంతు కొనసాగుతోంది. ఆమె ఏడవడం చూస్తే తప్ప అతనిలో కదలిక రావడం లేదు. విషయమంతా ఆమెకు తొలిరోజే వివరించాడు.

'ఇదెక్కడి విడ్డూరంరా బాబూ!' అనుకున్నా చేసేదేమీ లేక ఆమె కూడా అతనికి సహకరిస్తోంది. ఆమెకు గ్లిజరిన్ సహకరిస్తోంది. టీ.వీ. సీరియల్ నటిలా ఎప్పుడు కావాలంటే అప్పుడు ఏడ్చెయ్యడం ఇప్పుడు సత్యకు బాగా చేతనయింది.

బామ్మ తీర్థయాత్రలకు వెళ్ళింది. కొత్త దంపతులిద్దరూ పచ్చగా, వెచ్చగా కాపురం చేస్తున్నారు. కానీ అన్నిరోజులూ ఒకేలా ఉండవు గదా...! ఒక రోజు రాత్రి...

మామూలుగా 'ఏడుపుసీన్' నడుస్తూండగా టక్‌టక్‌మని తలుపు మోగింది. గోపాలం వెళ్ళి తలుపుతీసి ఎదురుగా పోలీసుల్ని చూసి బిత్తరపోయాడు. అతడ్ని తోసుకుంటూ యస్సై తన కానిస్టేబుల్‌తో సహా లోపలికొచ్చాడు. పోలీసులతోపాటు ఇటీవలే గోపాలం వాళ్ళ పక్కపోర్షన్‌లోకి అద్దెకు దిగిన వింధ్య కూడా లోనికొచ్చింది. ఆమె 'మహిళా హక్కుల వేదిక' కార్యదర్శి.

వింధ్య చెప్తోంది – ''ఇతనే యస్సై గారూ... నేను చెప్పిన గోపాలం. నేనీ పక్క వాటాలోకి వచ్చిన నెల రోజుల్నుండీ గమనిస్తున్నా. రోజూ రాత్రిపూట – పాపం ఆ అమ్మాయిని ఏడిపిస్తూ ఉంటాడు. వీళ్ళ పడగ్గదిలోంచి మా గదిలోకి సన్నగా వినిపిస్తుంటాయ్ ఆమె ఏడ్పులు. ఆ పిల్ల నడిగితే ఏఁవీ చెప్పదు. ఎంత భయపెట్టాడో, ఏమిటో... చూడండి. మిడిగుడ్లేసుకు ఎలా చూస్తున్నాడో దుర్మార్గుడు.''

గోపాలానికి ఏడుపొక్కటే తక్కువ. నోట మాట రావడం లేదు. మనసంతా శూన్యమైపోయింది.

''ఆమె స్పృహ తప్పి ఉంది సార్!'' సత్యను చూసొచ్చిన కానిస్టేబుల్ చెప్పాడు. ఆవేళప్పుడు పోలీసుల్ని నట్టింట్లో చూసేసరికి, భయపడిపోయి స్పృహపోగొట్టుకుందామె.

గోపాలంకేసి గుర్రుగా చూశాడు యస్సై. ఆ కళ్ళలో అనుమానం చూసి కుదేలైపోయాడు గోపాలం. ''సార్ అసలు విషయమేమిటంటే... తిమ్మన...''

''తిమ్మనెవఁడ్రా... నీ పార్ట్నరా? నడువు స్టేషనుకి... తేలుస్తా నీ సంగతి''.

వింధ్య అందుకుంది – ''పైకి అమాయకంగా కనిపిస్తూ ఇళ్ళలో భార్యలను నరకయాతన పెట్టే ఇలాంటి మేకముఖం తోడేళ్ళని తేలిగ్గా వదలకూడదు. స్టేషన్‌కి తీసుకెళ్ళి సరైన ట్రీట్‌మెంట్ ఇవ్వండి. ఆ అమ్మాయి తేరుకున్న తర్వాత నేను తీసుకుని వస్తా''.

***

స్టేషనుకు తీసుకెళ్ళి సెల్‌లో పడేసి నాలుగు పీకే వరకూ గోపాలం షాక్ నుంచి తేరుకోలేదు. తేరుకున్న తర్వాత ఒక్కసారిగా బావురుమన్నాడు. బొప్పికట్టిన తలని ఒకచేత్తో తడుముకున్నాడు. పగిలిన ముక్కుని మరో చేత్తో చూసుకున్నాడు.

ఎదురుగా చూసి ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు. యస్సై మళ్ళీ సెల్‌వైపు వస్తున్నాడు. అతని చేతిలో బెల్టు ''సార్. మళ్ళీ యుద్ధకాండ మొదలెట్టకండి. దయచేసి నేను చెప్పేదొకసారి వినండి''.

ఏ కళనున్నాడో యస్సై కుర్చీలో కూర్చుంటూ ''సరే, చెప్పు'' అన్నాడు. విషయమంతా వివరించాడు గోపాలం. అంతా అయ్యాక ఆ స్టేషనంతా పోలీసుల నవ్వుల్తో ప్రతిధ్వనించింది. ''చూడమ్మా గోపాలం. కథలు చెప్పడం మానేసి నిజాలు చెబితే నీ ఆరోగ్యానికి మంచిది'' చేతిలో బెల్టుతో కుర్చీలోంచి లేస్తున్న యస్సైని చూసి వణికిపోయాడు గోపాలం.

అంతలో 'ఏఁవండీ..' అంటూ సత్య పిలుపు. ఆ వెనుకనే వింధ్య. సత్య ద్వారా విషయమంతా విన్న యస్సై ఆశ్చర్యపోయాడు. ''అయితే ఇందాకట్నుంచీ ఇతను చెప్తున్నదంతా నిజమేనన్నమాట – సారీ గోపాలం! సాహిత్యంతో నాకసలు పరిచయం లేదు. అయినా సాహిత్యానికిలాంటి సైడ్ ఎఫెక్టులూ ఉంటాయని ఇప్పుడే నాకు తెలిసింది...''

''అసలిదంతా నా అత్యుత్సాహం వల్లనే జరిగింది. గోపాలం గారు, సత్యగారు నన్ను క్షమించాలి'' అంది వింధ్య.

ఏడవలేక నవ్వాడు గోపాలం. వాళ్ళను ఇంటిదగ్గర డ్రాప్ చేసి రమ్మని పోలీసు జీపును పంపించాడు యస్సై.

***

> **''ఇతనే యస్సై గారూ... నేను చెప్పిన గోపాలం. నేనీ పక్క వాటాలోకి వచ్చిన నెల రోజుల్నుండీ గమనిస్తున్నా. రోజూ రాత్రిపూట – పాపం ఆ అమ్మాయిని ఏడిపిస్తూ ఉంటాడు. వీళ్ళ పడగ్గదిలోంచి మా గదిలోకి సన్నగా వినిపిస్తుంటాయ్ ఆమె ఏడ్పులు. ఆ పిల్ల నడిగితే ఏఁవీ చెప్పదు. ఎంత భయపెట్టాడో, ఏమిటో... చూడండి. మిడిగుడ్లేసుకు ఎలా చూస్తున్నాడో దుర్మార్గుడు.''**

యస్సైకి గోపాలం వ్యవహారం విచిత్రంగా, ఇంట్రస్టింగ్‌గా అనిపించింది. అతనికి ఒక సైకాలజిస్ట్ ఫ్రెండున్నాడు. తన దగ్గరకు గోపాలాన్ని తీసుకెళ్ళాడు.

సంగతంతా విన్న సైకాలజిస్టు గోపాలం ప్రవర్తనను 'కండిషన్డ్ రిఫ్లెక్షన్' అంటారని చెప్పాడు. 'కొంతమంది సిగరెట్ తాగకుండా టాయిలెట్‌కు వెళ్ళలేకపోవడం లాంటిదే ఇది కూడా' అనీ, కొద్దిపాటి కౌన్సిలింగ్‌తో అంతా సర్దుబాటైపోతుందని వివరించాడు.

'కౌన్సిలింగ్' పూర్తయింది. ఇప్పుడూ గోపాలానికి ఆ పద్యమంటే ఇష్టమే గానీ, పద్యానికీ, పడగ్గదికీ మాత్రం సంబంధం లేదు.

ఆ సాయంత్రం యస్సైకి, సైకాలజిస్ట్‌కీ కృతజ్ఞతలు తెలిపి, దారిలో మల్లెలు కొనుక్కుని హుషారుగా ఇంటికి బయల్దేరాడు. రాత్రికి ఏ ఏడుపు సీన్లూ అవసరం లేకుండానే మూడ్‌లోకొచ్చేశాడు.

కానీ ఎక్కడో, ఏదో తేడా .. సత్యభామ ఏమాత్రమూ ఉత్సాహంగా లేదు. మౌనంగా, చల్లగా, స్తబ్దంగా...

''ఏమయింది డాళింగ్...?'' అడిగాడు గోపాలం. సిగ్గుపడుతూ చెప్పిందామె ''ఏడవకపోతే నాకు మూడ్ వచ్చేలా లేదండీ...!''

★